క్లుప్తంగా

గడువు పొడిగింపు

సిరిసిల్లకల్చరల్: గతేడాది పలు కారణాలతో ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోని విద్యార్థులకు ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించింది. ప్రభుత్వ ప్రైవేట్ సంస్థల్లో చదువుతున్న బీసీఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులు తమ దరఖాస్తులను ఈ పాస్ వెబ్‌సైట్‌లో నమోదు చేసేందుకు జూన్ 30 వరకు గడువు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని జిల్లా ఎస్సీడీవో రాజమోహన్‌రావు తెలిపారు.

బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు

బోయినపల్లి: మండలంలోని విలాసాగర్ నుంచి కొదురుపాక వెళ్లే రోడ్డులో విలాసాగర్ పరిసరాల్లో బ్రిడ్జి నిర్మాణానికి ఎంఆర్ఆర్ గ్రాంటు కింద రూ.70 లక్షలు నిధులు మంజూరైనట్లు పీఆర్ డీఈ విష్ణువర్ధన్ శనివారం తెలిపారు. పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ జరుగుతోందన్నారు.ఈ సందర్భంగా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఏనుగుల కనుకయ్య కృతజ్ఞతలు తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ముస్తాబాద్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఆయుష్ వైద్యాధికారి శశిప్రియ అన్నారు. మండలంలోని పోతుగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం వైద్యాధికారులు, సిబ్బందికి యోగాపై శిక్షణ ఇచ్చారు. ఈనెల 21 వరకు మండలంలోని వివిధ కమ్యూనిటీ సెంటర్లలో యోగాపై సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు.వైద్యాధికారి గీతాంజలి, ఫార్మసిస్టు రాజేశ్వర్, సూపర్‌వైజర్ ప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ ప్రవీణ్, ఏఎన్ఎంలు, పాల్గొన్నారు.

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త రజియా సుల్తానా

ఎల్లారెడ్డిపేట: పంటల్లో రైతులు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలని, బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు రజియా సుల్తానా, శ్రీనివాస్ అన్నారు.మండలంలోని రాచర్లగొల్లపల్లి రైతువేదికలో శనివారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించారు. రైతులు మోతాదులోనే యూరియా వాడాలన్నారు. భూసార పరీక్షల ఫలితాలు బట్టి సరైన మోతాదులో ఎరువులు వాడడంతో సాగు ఖర్చు తగ్గడమే కాకుండా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. మండల వ్యవసాయాధికారి రాజశేఖర్, ఏఎంసీ చైర్మన్ సాబేరా బేగం, ఏఈవోలు అనూష, శ్రీశైలం, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ పునరుద్ధరణ

సాక్షి స్పందన

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం విద్యుత్ పునరుద్ధరించారు. విద్యుత్ బకాయిలు రూ.30వేలు ఉన్నందున సెస్ అధికారులు విద్యుత్ కట్‌చేశారు. ఆర్టీసీ బస్టాండ్‌లో విద్యుత్ కట్ అనే శీర్షికన శనివారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన సిరిసిల్ల ఆర్టీసీ డిపో మేనేజర్ మండల సెస్ ఏఈ నగేష్‌కుమార్‌తో ఫోన్లో మాట్లాడారు. మధ్యాహ్నం విద్యుత్ బల్బులు వెలగడం, ఫ్యాన్లు తిరగడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న మాజీ ఎంపీపీ శరత్‌రావు, గ్రామస్తులు

ముస్తాబాద్: మద్దికుంటలో బొడ్రాయి, నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక హనుమాన్ ఆలయంలో నవగ్రహాల స్థాపన పూజలు చేశారు. గణపతి హోమం నిర్వహించారు. అనంతరం బొడ్రాయి ప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభించారు. మాజీ ఎంపీపీ జనగామ శరత్‌రావు, మాజీ సర్పంచ్‌లు భాగ్యశ్రీ, కరుణాల కళ, బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వామిగౌడ్, అనిల్, భూమయ్య, రాజు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

రుద్రంగి: కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పనులు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వమే అభివృద్ధి చేస్తుందటూ కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు గొప్పలు చెప్పుకుంటున్నారని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్యాడపు వెంకటేశ్, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు కర్ణవత్తుల వేణుగోపాల్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం 14 రకాల పంటలకు మద్దతు ధర పెంచడాన్ని హర్షిస్తూ శనివారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బీజేపీ సీనియర్ నాయకులు పడాల గణేశ్, బాలకిషన్ రావు, గండి శ్రీనివాస్, అల్లూరి రవీందర్, బోయిని రాజు, మొగుళ్ల శ్రీ హరి, వెంకటేశ్, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

75 ఏళ్ల అంగడి

- గంభీరావుపేటలో రోజువారీ సంత ప్రత్యేకత
- నిత్యం సందడి
- మరిన్ని సౌకర్యాలు కల్పించాలి విజ్ఞప్తి



గంభీరావుపేటలోని రోజువారీ సంత

గంభీరావుపేట: పల్లెలకు సంతలే ప్రధాన ఆకర్షణ.. ఇంటిల్లిపాదికి సరిపడా సరంజామా కొనాలంటే.. పంట ఉత్పత్తులు అమ్ముకోవాలన్నా.. వీటిపైనే ఆధారపడుతుంటారు. సాధారణంగా గ్రామాల్లో మనం వారసంతలు చూస్తుంటాం. కానీ గంభీరావుపేట మండల కేంద్రంలో ప్రతిరోజు సంత కొనసాగుతోంది. దాదాపు 75 ఏళ్ల నుంచి గాంధీచౌక్ ఏరియాలోని ప్రధాన కూడలిలో ఈ సంత కొనసాగుతుందని పెద్దలు చెబుతున్నారు.

జనంతో కిటకిట

కిరాణా సరుకుల నుంచి వస్త్రాలు, తాజా కూరగాయలు, వ్యవసాయ పరికరాలు.. తినుబండారాలు, మసాలా దినుసులు, పిల్లల బొమ్మలు.. ఒక్కటేమిటి.. ఏం కావాలన్నా గంభీరావుపేట సంతలో ఓ రౌండ్ వేయాల్సిందే. రోజు జరిగే ఈ సంతకు గంభీరావుపేటకు చుట్టు పక్కన ఉన్న గ్రామాల్లో నుంచి ప్రజలు వందలాది సంఖ్యలో వస్తుంటారు. ఉదయం ఆరుగంటల నుంచి సంత ప్రారంభమవుతుండగా.. ప్రజలు ఇక్కడికి వచ్చి సరుకులు తీసుకెళ్తుంటారు. జనంతో ఉదయం నుంచి రాత్రి వరకు కిటకిటలాడుతుంది. స్థానికంగా రైతులు తాము పండించే కూరగాయలను తాజాగా విక్రయిస్తుంటారు. తాజాదనమే కాకుండా తక్కువ ధరలకే లభిస్తాయి. బంధువులు, స్నేహితులు సంతలో కలిసి పిచ్చాపాటి కబుర్లు మాట్లాడుకుంటారు. ఇంకా గతంలో బాగుండేదని.. ప్రస్తుతం ఊరు అభివృద్ధి చెందడంతో వీధికో కిరాణా దుకాణం వెలిసింది. దీంతో సంత ప్రాధాన్యం కాస్త తగ్గిందని చెబుతున్నారు. తరతరాలుగా వస్తున్న నిత్య సంతపై పాలకులు నిర్లక్ష్యం చూపడం .. కనీస సౌకర్యాలు కల్పించడం లేదని చెబుతున్నారు. సరైన సదుపాయాలు లేకపోవడంతో సంత కళ తప్పుతోంది. చుట్టు పక్క జిల్లాల నుంచి కూరగాయలు తెచ్చేవారు. ప్రస్తుతం వారు మానేశారు. దీంతో కొనుగోలుదారుల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది.

చాలా ఏళ్లుగా ప్రత్యేకత



గంభీరావుపేట సంతకు చాలా ఏళ్లుగా ప్రత్యేకత ఉంది. ఉదయం లేవగానే చాలామంది మార్కెట్ ఏరియాకు చేరుకుంటారు. కాసేపు మిత్రులతో ముచ్చటించి ఇంటికి అవసరమైన నిత్యావసర సరకులు కొనుగోలు చేసి తెచ్చుకుంటారు. ఎన్నో గ్రామాల ప్రజలు ఇక్కడికి వస్తుంటారు. మేము మా చిన్నతనం నుంచి చూస్తున్నాం.

– లక్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ ఉద్యోగి, గంభీరావుపేట

సౌకర్యాలు కల్పించాలి



గంభీరావుపేట సంతలో సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రోజువారీ సంత కొనసాగుతోంది. వందల సంఖ్యలో అమ్మకందారులు, విక్రయదారులు వస్తున్నారు. మార్కెట్‌కు ఏళ్లనాటి చరిత్ర ఉంది. సరైన సదుపాయాలు కల్పిస్తే మరింత సంత సౌకర్యవంతంగా తయారవుతుంది.

– రాగిశెట్టి నారాయణ, గంభీరావుపేట



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రుద్రంగి: మండలకేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో 2000–2001లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకొని రోజంతా ఆనందంగా గడిపారు. అనంతరం తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఊపిరితిత్తుల పరీక్షలు

- ఆధునిక 'ట్రిమోఫ్లో మిషన్'తో శిబిరం
- డాక్టర్ చందనరెడ్డి, పల్మనాలజిస్ట్



సిరిసిల్ల: జిల్లా కేంద్రంలోని చందనరెడ్డి చెస్ట్ క్లినిక్‌లో శనివారం ఉచితంగా ఊపిరితిత్తుల పరీక్షలు నిర్వహించారు. ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవం సందర్భంగా శ్వాసకు సంబంధించి, ఊపిరితిత్తుల్లో సమస్యలను గుర్తించే ట్రిమోఫ్లో మిషన్‌తో పరీక్షలు చేసినట్లు పల్మనాలజిస్ట్ డాక్టర్ చందనరెడ్డి తెలిపారు. పవర్‌లూమ్ కార్మికులు, భవన నిర్మాణరంగం, బీడీ పరిశ్రమ, వీధి వ్యాపారులు, బీడీ, సిగరెట్ తాగే వారు శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడుతుంటారని తెలిపారు. ట్రిమోఫ్లో మిషన్ ద్వారా గుర్తించడం వీలవుతుందన్నారు.ఊపిరితిత్తుల్లో సూక్ష్మమైన సమస్యలను సులభంగా గుర్తించేందుకు, వైద్యసేవలు పొందేందుకు ఈ మిషన్ ఉపకరిస్తుందని చందనరెడ్డి తెలిపారు. ఊపిరి సమస్యలతో బాధపడేవారికి ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందించినట్లు వివరించారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

ఎల్లారెడ్డిపేట: విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో కృష్ణహరి కోరారు. పదో తరగతిలో ప్రతిభ చూపిన మండలంలో ప్రభుత్వ స్కూళ్లకు చెందిన 57 మంది విద్యార్థులను మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు బుస్స దశరథం, మండలాధ్యక్షుడు గుండా చిన్నమల్లేశం, రాచర్ల జూనియర్ కాలేజీ చైర్మన్ జయశ్రీ, డైరెక్టర్ ఐత వెంకటేశం, సంఘం మండల కార్యదర్శి బచ్చు అశోక్, సలహాదారు గంప నాగేందర్, సిద్ధంశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

3 నుంచి రెవెన్యూ సదస్సులు

వీర్నపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో జూన్ 3 నుంచి భూ భారతిపై రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ ముక్తార్ పాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అడవిపదిర, మద్దిమల్లలో జూన్ 3న, కంచర్ల, గర్జనపల్లిలో 4,5న, వీర్నపల్లిలో 5,6న, వన్‌పల్లిలో 6న రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

బోయినపల్లి: తడగొండలో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభయ్యాయి. మొదటి రోజు గణపతి పూజ, పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, శాల సంస్కారం, క్షేత్రపాలక నవగ గ్రహ సర్వతోభద్ర మండపారాధనలు తదితర కార్యక్రమాలు నిర్వహించి అన్నదానం చేశారు.

సన్మానం



ఎస్సై మారుతిని సన్మానిస్తున్న ఎస్పీ మహేశ్ బీ గీతే

సిరిసిల్ల క్రైం: ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని, ఎస్పీ మహేశ్ బీ గీతే అన్నారు. వేములవాడ రూరల్ ఎస్సైగా పనిచేస్తున్న మారుతి, కోనరావుపేట హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రాజమౌళి ఉద్యోగ విరమణ పొందగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సన్మానించారు.సమావేశంలో ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

వంతెనల నిర్మాణాలు చేపట్టాలి



కోనరావుపేట: మండలంలోని పలు గ్రామాల్లో వంతెనల నిర్మాణాలను చేపట్టాలని బీజేపీ మండలాధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ అన్నారు. మండలంలోని కొండాపూర్, వెంకట్రావుపేట గ్రామాల మధ్య ఉన్న వంతెన వర్షాలకు కొట్టుకుపోగా శనివారం పరిశీలించారు. తాత్కాలిక మరమ్మతులు చేపడుతుండగా ఏటా వర్షాలకు కొట్టుకుపోవడంతో ప్రజలు రవాణాకు ఇబ్బంది పడుతున్నారన్నారు. వీటితో పాటు కొండాపూర్ పెంటివాగుపై, పలు గ్రామాల మధ్య మూలవాగుపై వంతెనలు నిర్మించాలన్నారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ పల్లం అన్నపూర్ణ, మాజీ వైస్‌ఎంపీపీ తీగల రవీందర్‌గౌడ్, నాయకులు నందగిరి నారాయణ, సురేశ్‌రావు, తీగల జయశ్రీ, దుర్గం తిరుపతి, ముష్కం శ్రీనివాస్, నాగుల మల్లేశం, విజయ్, రాజు, సుమన్, రాజేశం తదితరులు ఉన్నారు.

అహల్యాబాయ్‌కు నివాళి



సిరిసిల్లటౌన్: పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో అహల్యాబాయ్ జయంతి శనివారం నిర్వహించారు. జిల్లా కేంద్రంలో అహల్యాబాయ్ జయంతి, శోభాయాత్ర చేపట్టారు. అనంతరం అహల్యాబాయ్ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఇక్కడ అహల్యా బాయ్ జయంతి కమిటీ కన్వీనర్ మల్లారపు సంతోష్ రెడ్డి, కొకన్వీనర్ పల్లం అన్నపూర్ణ, వైశాలి, మ్యాన రాంప్రసాద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్, వివిధ మండలాల అధ్యక్షులు క్రాంతి, రామచంద్రారెడ్డి, బాలాజీ, రమేశ్, లక్పతి, పరమేష్, నాయకులు విష్ణు, మహిళా మోర్చా నాయకులు ఉన్నారు.

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం అహల్యబాయ్ జయంతి నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు భూమల్ల అనిల్‌కుమార్ తదితరులున్నారు.

ధూమపానం మానేయాలి

- జిల్లా వైద్యాధికారి ఎస్.రజిత

సిరిసిల్ల: ధూమపానం మానేయాలని జిల్లా వైద్యాధికారి ఎస్.రజిత కోరారు. ప్రపంచ ధూమపానం వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం మాట్లాడారు. ధూమపానం ఆరోగ్యాన్ని నాశనం చేసే మానసిక బానిసత్వమన్నారు. సిగరెట్, గుట్కా, బీడీ వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఊపిరితిత్తుల క్యాన్సర్, హార్ట్ అటాక్, నోటి క్యాన్సర్‌లకు కారణమన్నారు. ×ధూమపానానికి ।నో׀ అనండి – జీవితానికి ।హెలో׀ చెప్పండని ఆమె కోరారు.

పొగాకుకు దూరంగా ఉండాలి



సిరిసిల్ల టౌన్ : న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న పి.లక్ష్మణాచారి

సిరిసిల్లటౌన్: పొగాకు ఉత్పత్తుల సేవనం ప్రాణాంతకమని సిరిసిల్ల సీనియర్ సివిల్ జడ్జి పి.లక్ష్మణాచారి పేర్కొన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం కోర్టు ఆవరణలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడారు. యువత సినిమాలు, టీవీలు చూసి పొగాకు సేవించడం ఫ్యాషన్‌గా మార్చుకుంటున్నారన్నారు. లోక్ అదాలత్ మెంబర్ చింతోజు భాస్కర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జూపెల్లి శ్రీనివాస్‌రావు, పరుశురాం పాల్గొన్నారు.

ముగిసిన ధాన్యం కొనుగోళ్లు

గంభీరావుపేట: మండలంలో యాసంగి వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ శనివారంతో ముగిసింది. మండలవ్యాప్తంగా ఐకేపీ ఆధ్వర్యంలో 23 కొనుగోలు కేంద్రాల ద్వారా అధికారులు ధాన్యం కొనుగోళ్లు సేకరించారు. ఇప్పటి వరకు మండలవ్యాప్తంగా 4,807 మంది రైతుల దగ్గర నుంచి 2లక్షల 75వేల క్వింటాళ్ల ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేశారు. సహకరించిన రైతులు, అధికారులకు, సిబ్బందికి ఐకేపీ ఏపీఎం సుదర్శన్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయంలో పూజలు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని హనుమాన్ ఆలయంలో వర్షాలు కురవాలని కోరుతూ.. రైతులు శనివారం ముడుపు విప్పారు. ఆలయంలో రైతులు ప్రత్యేక పూజలు చేసి పంటలు వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం గ్రామంలో ఎడ్లబండ్ల ఊరేగింపు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో రైతులు గుండాడి వెంకట్‌రెడ్డి, పారిపల్లి రాంరెడ్డి, రవీందర్‌రెడ్డి, పారిపల్లి సంజీవరెడ్డి, పండితులు దయానంద్‌శర్మ పాల్గొన్నారు.



రుద్రంగి: మండలకేంద్రంలోని రామకిష్టాపూర్ కాలనీలోని దారిలో చెట్లు, ముళ్లపొదలు ఏపుగా పెరిగి దారిపైకి వచ్చాయి. కాలనీవాసులు దారిగుండా రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులకు పలుసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్య పరిష్కరించాలి.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
రాందాస్, రుద్రంగి గ్రామ పంచాయతీ కార్యదర్శి: 9666555442

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

ఖండాంతరాలు దాటిన తెలంగాణ ఆత్మగౌరవం



ఖతార్‌లో తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఖతార్ లేబర్ మినిస్టర్ ఖలీద్ మహమ్మద్

- ఖతార్‌లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ: తెలంగాణ ఆత్మగౌరవం ఖండాంతరాలు దాటిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ఖతార్‌లో శనివారం నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో అక్కడి మినిస్టర్ ఆఫ్ లేబర్ ఖలీద్ మహమ్మద్‌తో కలిసి పాల్గొన్నారు. విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ సామాజిక సేవలు అందిస్తున్న తెలంగాణ గల్ఫ్ సమితి కార్మిక సంఘాన్ని చూస్తుంటే గర్వంగా ఉందన్నారు. గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. టీపీసీసీ ఎన్ఆర్ఐ గల్ఫ్ అధ్యక్షుడు, గల్ఫ్ అడ్వైజరీ కమిటీ మెంబర్ సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, గల్ఫ్ బోర్డు అడ్వైజరీ కమిటీ మెంబర్ గుగ్గిళ్ల రవిగౌడ్, ఎస్బీఎఫ్ అధ్యక్షుడు శానవాజ్, ఎస్బీఎఫ్ అడ్వైజరీ చైర్మన్ కోడూరి శివప్రసాద్, ఐసీసీ అడ్వైజరీ చైర్మన్ బాబు రాజన్న, తెలంగాణ గల్ఫ్ సమితి గౌరవ అధ్యక్షుడు సుందరగిరి శంకర్‌గౌడ్, ఎస్బీఎఫ్ ఉపాధ్యక్షుడు రషీద్ మహమ్మద్, ఎస్బీఎఫ్ జనరల్ సెక్రెటరీ దీపక్ శెట్టి, సెక్రెటరీ జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో ఇందిరమ్మ ఇళ్లు పూర్తిచేయాలి

ఎల్లారెడ్డిపేట: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తమకు మంజూరైన ఇళ్లను త్వరగా పూర్తిచేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని అక్కపల్లి, బుగ్గరాజేశ్వర తండా, రాచర్లబొప్పాపూర్, ఎల్లారెడ్డిపేటలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. గృహ నిర్మాణశాఖ ఏఈఈ చైతన్య, ఏఎంసీ వైస్ చైర్మన్ గుండాడి రాంరెడ్డి, నాయకులు దేవేందర్, భూంరెడ్డి, గణపతి, లచ్చిరెడ్డి, మోహన్, సాహెబ్, పద్మారెడ్డి, కార్యదర్శి పవిత్ర, లబ్ధిదారులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: పేదింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెలుముల స్వరూప తిరుపతి రెడ్డి అన్నారు. మండలంలోని పాపాయిపల్లి, రామన్నపల్లి, బస్వాపూర్, నేరెళ్ల గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు, అధికారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు టోని, ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎంపీవో మీర్జా, లింగాల భూపతి, సత్తు శ్రీనివాస్ రెడ్డి, మునిగెల రాజు, ప్రశాంత్, లబ్ధిదారులు పాల్గొన్నారు.



తంగళ్లపల్లి : ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు, అధికారులు

కోనరావుపేట: గ్రామంలో నిర్మించే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నాలుగు దశల్లో బిల్లులు వస్తాయని ఏఎంసీ డైరెక్టర్ వెంగళ వెంకన్న అన్నారు. ధర్మారంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారు. శ్రీనివాస్, బుగ్గయ్య, సింగిల్‌విండో డైరెక్టర్ ఇప్పరాములు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● ఎంపీడీవోకు ఫిర్యాదు

ఇల్లంతకుంట: రాజీవ్ యువవికాస పథకంలో భాగంగా రూ.4లక్షల కోసం దరఖాస్తు చేసుకుంటే రూ.50వేలు లోన్ మంజూరు ఇవ్వడంపై ఓ దివ్యాంగుడు ఎంపీడీవోకు శనివారం ఫిర్యాదు చేశారు. మండలంలోని దాచారంకు చెందిన మారవేణి చంద్రశేఖర్ వికలాంగుల కోటాకింద రాజీవ్ యువ వికాస పథకంలో గొర్రెల యూనిట్ కోసం రూ.4లక్షల రుణం కావాలని దరఖాస్తు చేసుకున్నాడు. రూ.50వేలు మంజూరు కావడంతో ఎంపీడీవోకు ఫిర్యాదు చేశాడు. తనకు రూ.4లక్షల రుణం మంజూరు ఇప్పించాలని అధికారులను కోరుతున్నాడు. దీనిపై ఎంపీడీవో శశికళను వివరణ కోరగా చంద్రశేఖర్‌కు రూ.4లక్షల లోన్ మంజూరయ్యేలా చూస్తామని తెలిపారు.

● 'కవ్వంపల్లికి మంత్రి పదవి ఇవ్వాలి'

ఇల్లంతకుంట: ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ఇప్పటివరకు మాదిగ సామాజిక వర్గానికి మంత్రి పదవి దక్కలేదని ఇప్పటికైనా కవ్వంపల్లి సత్యనారాయణకు జిల్లా నుంచి మంత్రి పదవి ఇవ్వాలని మానకొండూర్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పసుల వెంకటి కోరారు. శనివారం ఆయన ఇల్లంతకుంటలో మాట్లాడారు. జిల్లా నుంచి మంత్రివర్గ విస్తరణలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు చోటు కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన కోరారు.

● సన్మానం

వేములవాడ : ఉద్యోగ సమయంలో చేసిన సేవలు గుర్తుండిపోతాయని ఆలయ ఉద్యోగుల సంఘం నాయకులు అన్నారు. ఆలయంలో సుప్రభాత గాయకులు మధు శ్రీనివాస్‌శర్మ, పర్యవేక్షకులు వరి నర్సయ్య, ఎలక్ట్రికల్ హెల్పర్ గుండ అంజయ్య దంపతులను స్వామివారి ఓపెన్‌స్లాబ్‌లో శనివారం ఘనంగా సత్కరించారు. ఆలయ అధికారులు, సిబ్బంది, ఉద్యోగ సంఘం నాయకులు పాల్గొన్నారు.

● చెట్టుకు నిప్పు పెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

వీర్నపల్లి: మండలకేంద్రంలోని ఎల్లారెడ్డిపేటకు వెళ్లే ప్రధాన రోడ్డు పక్కనున్న చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి నిప్పుపెట్టారు. గ్రామ పంచాయతీ సిబ్బంది, అటవీశాఖ అధికారులు మంటలను ఆర్పివేశారు. చెట్టు లోపలిభాగం కాలిపోవడంతో బలమైన గాలులు వీస్తే పడిపోయే ప్రమాదం ఉండటంతో ముందే అధికారులు చెట్టును తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

● నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

ఇల్లంతకుంట: మండలంలోని పాత్తూరు, ఇల్లంతకుంట, గ్రామాల్లో ఫెస్టిసైడ్స్ దుకాణాల్లో వ్యవసాయ అధికారులు తనిఖీలు నిర్వహించారు. నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. బోయినపల్లి, ఇల్లంతకుంట, మండలాల వ్యవసాయ అధికారులు ప్రణీత, సురేశ్‌రెడ్డి, ఏఎస్ఐ షఫియొద్దీన్, కానిస్టేబుల్ మహేష్, తదితరులున్నారు.

● డాక్టరేట్ ప్రదానం

ముస్తాబాద్: ముస్తాబాద్‌కు చెందిన యెల్ల రాంరెడ్డికి తమిళనాడులోని హోసూరు ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ శనివారం డాక్టరేట్ ప్రదానం చేసింది. సామాజిక సేవలకు గుర్తింపుగా వచ్చిన డాక్టరేట్‌తో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతామని రాంరెడ్డి తెలిపారు.